క్లుప్తంగా

దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు

జి.సిగడాం: మండలంలోని గేదెలపేట, పెంట, గంగన్నదొరపాలెం, జాడ, జి.సిగడాం గ్రామాల్లో సోమవారం దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5 నుంచి 10 గంటలకు హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణలో అన్నదానం చేశారు.

వరి విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏఓ శారద

జి.సిగడాం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన వరి విత్తనాల కోసం ఆన్‌లైన్‌లో సంబంధిత రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శారద సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌బీకేలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి రైతుకు విత్తనాలను అందజేయాలన్నారు. ప్రభుత్వం కిలో రూ.10 రాయితీపై విత్తనాలు అందజేస్తుందన్నారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులకు వారం రోజుల్లో విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏఈఓ కోమ్మల అప్పారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు ప్రవేశ పరీక్ష

జి.సిగడాం: స్థానిక ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతుల్లో మిగులు సీట్లు భర్తీ చేసేందుకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని చర్యలూ తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక సోమవారం తెలిపారు. విద్యార్థులు ఉదయం 8.45 గంటలకే విద్యాలయానికి చేరుకోవాలన్నారు. 2024–25 సంవత్సరంలో మిగిలిన సీట్లును కేటగిరీ ప్రకారం ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తామన్నారు. ఇప్పటికే విద్యాలయంలో కేటగిరీల వారీగా మిగులు సీట్లు వివరాలను నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రవేశాలు ఉంటాయన్నారు.

యువకుల రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకుడు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో ఇద్దరు యువకులు సోమవారం రక్తదానం చేశారు. వారికి రక్తనిధి ప్రతినిధులు ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజర్ హసినాబేగం, చైతన్య, నంది ఉమాశంకర్, రమణ ఉన్నారు.

మొక్కలు నాటివేత


మొక్కలు నాటుతున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం పట్టణానికి చెందిన స్వీప్ స్వచ్ఛంద సంస్థ 29 సంవత్సరాలు పూర్తి చేసుకొని 30వ సంవత్సరంలోకి సోమవారం అడుగుపెట్టింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు కొమ్ము రమణమూర్తి ఆధ్వర్యంలో మండల పరిధిలోని తండేవలస గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1995 నుంచి దండి కారణ్యంలో ఆదివాసీ హక్కులు, అభివృద్ధిపై అనేక కార్యక్రమాలు చేపట్టి నాలుగు జిల్లాల ప్రజల మన్ననలు పొందామన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో మిగులు సీట్లు భర్తీకి నోటిఫికేషన్

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లి గ్రామంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి సంబంధించి మిగులు సీట్లు భర్తీకి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్.శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరికి ఈ నెల 19వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలో ప్రవేశానికి కూడా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ జిరాక్స్, కుల ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జత చేయాలన్నారు.

ఘనంగా అమ్మవారి ఉత్సవం

టెక్కలి రూరల్: మండలంలోని కిట్టాలపాడు గ్రామంలో పాలపోలమ్మతల్లి అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి. రెండో రోజైన సోమవారం మహిళలు అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని కోరుకున్నారు.

ప్రజల పక్షాన పోరాడుదాం

● ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: కూటమి ఇచ్చే హామీలు శత శాతం అమలు చేయాలని, లేని పక్షాన ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని పాతర్లపల్లి గ్రామంలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జి.సిగడాం మండల నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో సహకరించి ఓట్లు వేసిన ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజానీకానికి, నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో కూటమి నాయకులు రెచ్చగొట్టి భౌతికదాడులకు పాల్పడుతున్నారని, కార్యకర్తలందరూ సమన్వయం పాటించాలని కోరారు. కార్యకర్తలకు వెన్నుదన్నుగా తనతోపాటు నియోజకవర్గ, మండల నాయకులు ఉంటారన్నారు. ప్రజా తీర్పును ప్రతిఒక్కరూ గౌరవిద్దామని, ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమన్నారు. ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధే ధ్యేయంగా కొత్తగా అధికారంలోనికి వచ్చిన కూటమి నాయకులు పరిపాలన సాగించాలన్నారు. ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై భౌతికదాడులు, ఆస్తులు ధ్వంసం చేయడం వంటివి ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం కాదన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడవాలలన్నారు. ఈ కార్యక్రమంలో జి.సిగడాం మండల ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, మండల నాయకులు డోల వెంకటరమణ, ఆబోతుల జగన్నాథం, తోలేటి వెంకటరావు, మక్కా సాయిరాం, ప్రకాష్, బూరాడ చిన్నారావు, పిల్లల శివకుమార్, బాలి అప్పలసూరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

రూ.3 లక్షల ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న అరబిందో ప్రతినిధులు

రణస్థలం: పైడిభీమవరం పారిశ్రామిక వాడలో గల ఏపీటోరియా (అరబిందో) పరిశ్రమ ప్రతినిధులు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు క్షతగాత్రులకు పరిశ్రమ ఎండీలు నిత్యానందరెడ్డి, శరత్ చంద్రరెడ్డి ఆదేశాల ప్రకారం రూ.మూడు లక్షలు ఆర్థిక సాయం చేశారు. మండలంలోని పైడిభీమవరం పంచాయతీకి చెందిన కోనేటి జశ్వంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మెదడుకు చికిత్స చేయాల్సి వచ్చింది. ఇదే పంచాయతీకి చెందిన లోడగల రాధా అనే మహిళ మరో రోడ్డు ప్రమాదంలో గాయపడి పక్కటెముకలు విరిగిపోయి జీవనోపాధి కోల్పోవాల్సి వచ్చింది. అరబిందో ఫార్మా ఫౌండేషన్ తరపున కోనేటి జశ్వంత్‌కు రూ.రెండు లక్షలు, లోడగల రాధాకు ఒక లక్ష రూపాయలు చెక్‌లను బాధిత కుటుంబ సభ్యులకు అరబిందో ప్రతినిధులు పరిశ్రమలో అందజేశారు. కార్యక్రమంలో ఏపీటోరియా హెచ్‌ఆర్ మేనేజర్ కె.కమలాకర్ రెడ్డి, పైడిభీమవరం మాజీ సర్పంచ్ లంకలపల్లి ప్రసాద్, ఎంపీటీసీ మునకాల దుర్గారావు తదితరులు ఉన్నారు.

తాగునీటి అవస్థలు



ఫరీదుపేటలోని పంపు హౌస్


గ్రామంలోని ట్యాప్ పాయింట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామస్తులు గత 10 రోజులుగా తాగునీరు అందక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గ్రామానికి తాగునీరు అందించే సృజల ధార పథకం పంప్ హౌస్ మరమ్మతులకు గురైంది. వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేతేరులో బాల సంస్కార కేంద్రం ప్రారంభం

ఎచ్చెర్ల:

సనాతన ధర్మం, హిందై విలువలను పరిరక్షించే బాధ్యతను దుర్గా వాహిని భుజాన వేసుకుందని జిల్లా దుర్గా వాహిని సంయోజిక హైందవి తెలిపారు. లావేరు మండలంలోని నేతేరు గ్రామంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో దుర్గా వాహిని బాల సంస్కార కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. భారతమాత, దుర్గమాత చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. హిందూ ధర్మ పరిరక్షణే కర్తవ్యంగా పనిచేస్తున్న సంస్థ దుర్గా వాహిని అని అన్నారు. నేడు సమాజంలో పెరిగిపోతున్న లవ్ జిహాద్ వంటి ఘటనలపై సంపూర్ణంగా అవగాహన కల్పించారు. అనంతరం బాలికలు పలు శక్తి ప్రదర్శనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దుర్గా వాహిని బల సంస్కార కేంద్ర ప్రముఖ్ శ్రావణి, జిల్లా ఉపాధ్యక్షుడు జి.భాస్కర్, జిల్లా ధర్మప్రసార ప్రముఖ్ టంకాల సూరప్పడు, ప్రాంత మందిర అర్చక పురోహిత ప్రముఖ్ ఫల్గుణరావు, విశ్వ హిందూ పరిషత్ సభ్యుడు శ్రీధర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


శక్తి ప్రదర్శనలు చేస్తున్న బాలికలు

కోటేశ్వరాలయంలో అభిషేకాలు


స్వామివారికి అభిషేక పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో వేంచేసిన బలరామ ప్రతిష్ఠ దేవాలయంగా ప్రసిద్ధి పొందిన ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం అభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి విశేషంగా అభిషేకాలు చేసి రకరకాల పూలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నార.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: శివశ్రీ నృత్య కళానికేతన్ నృత్య దర్శకులు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ దర్శకత్వంలో 40 రోజులు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మే ఒకటి నుంచి ఈ నెల పదో తేదీ వరకూ కూచిపూడి, భరత నాట్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు నృత్య దర్శకుడుశ్రీకాంత్ చెప్పారు. శిక్షణలో పాల్గొన్న 105 మందికి ప్రశంసాపత్రాలు అందచేశారు.

ఉమాకవికి పర్యావరణ పురస్కారం ప్రదానం


ఉమా కవిని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: గార మండలం ఆడవరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు (ఉమా కవి)కి అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచ పర్యావరణంపై హైదరాబాద్ రవీంద్రభారతిలో జి.సి.ఎస్.వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రసంగంలో ఉమా కవికి గ్లోబల్ పర్యావరణ పురస్కారంతో ప్రతినిధులు సోమవారం సత్కరించారు. ఈ విషయాని శ్రీకాకుళం సాహితీ చైతన్యకిరణాలు, బాలకథా నిలయం అధ్యక్షులు బి.హెచ్.ఉమాకవి తెలియజేశారు. 'వనం–మనం' అనే కవితను, పర్యావరణంపై ఉమాకవి ప్రసంగినట్టు పేర్కొన్నారు. బంగారు నంది విగ్రహంతో అందజేసి దుశ్శాలువతో ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రాజు ఉమాకవిని సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణా బీసీ కమిషనర్ వకులాభరణం కృష్ణమోహన్, సినీ నటుడు రామిశెట్టి తిరుపతి దొరై స్వామి, న్యూట్రినిస్టు అనుప్రసాద్, కె.కృష్ణవేణి, ఎ.ఎస్.శ్రీనివాస్, నీరెట్టి సుధాకర్ ఉన్నారు.

మహిళల జీవనోపాధికి కృషి


సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మహిళల జీవనోపాధికి హ్యూమన్ డెవలప్‌మెంట్ స్టూడెంట్స్ అసోసియేషన్ (హెచ్‌డీఎస్‌ఏ) ఎంతో కృషి చేస్తోందని నాబార్డు డీడీఎం కె.రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని ఒప్పంగి గ్రామంలో సోమవారం మిల్లెట్ ఫుడ్స్ శిక్షణలో భాగంగా సర్టిఫికెట్ల ప్రదానం చేసే కార్యక్రమాన్ని నాబార్డ్ సహకారంతో హెచ్‌డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించి వ్యాపార మెలకులు నేర్చుకోవాలని నాబార్డ్ డీడీఎం ఆకాంక్షించారు. అనంతరం మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌డీఎస్‌ఏ వ్యవస్థాపకులు పీవీ రమణ, కేవీకే కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి ఉన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన జిల్లా నాయకులు


రామ్మోహన్‌నాయుడును అభినందిస్తున్న దృశ్యం


శ్రీకాకుళం న్యూకాలనీ: కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీకాకుళం ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడుని సోమవారం జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు కలిసి అభినందించారు. ఢిల్లీలోని రామ్మోహన్‌నాయుడు నివాసంలో ఏపీఎన్‌జీవో సంఘ రాష్ట్ర నాయకుడు చౌదరి పురుషోత్తమనాయుడు, బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, సామాజిక వేత్త సూర శ్రీనివాసరావు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు.

కాశీబుగ్గలో వరుస చోరీలు


కాశీబుగ్గ శ్రీనివాసనగర్‌లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో వరుసగా చోరీలు జరుగుతుండడంతో జంటపట్టణాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి కాశీబుగ్గ శ్రీనివాసనగర్‌లోని రెండు ఇళ్లలో చోరీలు జరిగాయి. కె.ఉమాపతి అనే ఆర్మీ ఉద్యోగి ఇంటిలో ఆయన భార్య లోకేశ్వరి లేకపోవడం చూసి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు విరగ్గొట్టి బీరువాలోని రెండు తులాల బంగారం ఆభరణాలు దొంగిలించారు. వారి పక్కనే ఉన్న భాస్కరరావు అనే ఇంటి కిటికీ గ్రిల్స్ తొలగించి లోపలకు జొరబడి చోరీకి ప్రయత్నించారు. జరిగిన సంఘటనపై సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు, క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. నెలరోజుల కిందట యాభైలక్షల విలువైన బంగారం దొంగతనం సైతం జవాన్ ఇంటిలోనే జరగడం తెలిసిందే.

యువకుడు అదృశ్యంపై ఫిర్యాదు


లంక రాజా

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళంలోని చినబరాటం వీధికి చెందిన యువకుడు లంక రాజా (అలియాస్ లక్కీ) అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్సై కామేశ్వరరావు సోమవారం తెలిపారు. చినబరాటం వీధిలో ఓ రూమ్‌లో అద్దెకుంటున్న లంక రాజా కొన్నాళ్లు అమెజాన్ డెలివరీ బాయ్‌గా పనిచేసి మానేశాడు. ఇతని తల్లిదండ్రులు నెల్లూరులో వలసకూలీలుగా ఉన్నారు. రాజాకు మద్యం అలవాటు ఉండడంతో ఏ పనిలో కూడా స్థిరంగా ఉండేవాడు కాదు. ఈ క్రమంలో శుక్రవారం తన మిత్రుడు శివతో కలిసి సబ్‌డివిజన్ కార్యాలయం సమీపంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్లాడు. అక్కడ మిత్రుని మొబైల్ అవసరమని తీసుకున్నాడు. ఆ రోజు నుంచి రాజా కనిపించడం లేదంటూ అతని మేనమామ పిరియా రాజా పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

నవధాన్యాల సాగుతో భూసారం


పంపిణీకి సిద్ధం చేసిన కిట్లు

నరసన్నపేట: ఖరీఫ్ పనులకు ముందు పొలంలో నవధాన్యాలు వేయడం ద్వారా భూసారం పెరుగుతుందని ఏపీసీఎన్ఎఫ్ స్టేట్ ఆఫీసర్ హేమసుందర్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో స్వయం శక్తి మహిళలు సిద్ధం చేసిన 200 నవధాన్యాల కిట్లును సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కిట్లులో 9 రకాల ధాన్యాలు ఉన్నాయన్నారు. వీటిని పొలంలో వేసి కలియ దున్నడం ద్వారా భూమి గుల్ల బారి పంటలు బాగా పెరిగేందుకు సహకరిస్తుందన్నారు.

ఒక్కో కిట్టు రూ.400లకు విక్రయించడం జరిగిందని, వీటిని రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని వెలుగు డీపీఎం రేవతి, అసిస్టెంట్ డీపీఎం ధనుంజయ్ అన్నారు. నవధాన్యాల సాగు .. నేల తల్లికి బాగు.. అనే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. వెలుగు ఏపీఎంలు సాయిలక్ష్మి, హేమసుందర్, సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో కాకినాడ శ్రీఆదిత్య విద్యార్థుల ప్రతిభ


ఆలిండియా ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశవ్యాప్తంగా ఈనెల తొమ్మితో తేదీన వెలువడిన జేఈఈ అడ్వాన్స్–2024 ఫలితాల్లో శ్రీకాకుళంలోని కాకినాడ శ్రీ ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించి ప్రతిభ కనబర్చారు. ఈ విషయాన్ని కళాశాల సెక్రటరీ ఎస్.కె.దీపక్‌రెడ్డి, డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎం.ఢిల్లీశ్వరరావు తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆలిండియస్థాయిలో మెరుగైన ర్యాంకులతో విజయబావుటా ఎగురవేసిన విద్యార్థులను, ఐఐటీ, ఎన్ఐటీ సంస్థల్లో సీట్లు దక్కించుకోబోతున్న విద్యార్థులను అభినందించారు. కళాశాల నుంచి భమిడిపాటి స్వర్ణశ్రీ ఆలిండియా 1941, మాతా ప్రవల్లిక 2795, జర్జాన రాజ్‌గౌతమ్ 1240, జర్జాన రాజ్‌గిరీష్, చింతాడ దివ్యతేజశ్రీ 3700 వంటి ర్యాంకులతో సత్తాచాటారని వారు పేర్కొన్నారు.

జానపద కళలను పరిరక్షించాలి

● ఎంపీపీ బోర పుష్ప


కోలాటం నృత్య మహిళలతో ఎంపీపీ బోర పుష్ప, గ్రామస్తులు


కోలాట ప్రదర్శనలో మహిళలు

ఇచ్ఛాపురం రూరల్: అంతరించి పోతున్న జానపద కళల్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ కళాకారునిపై ఉందని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన పాతిక మంది మహిళలు కోలాటాన్ని నేర్చుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామంలో కళను ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. జానపద కళలు శ్రీకాకుళం జిల్లా సొంతమన్నారు. అటువంటి కళను నేర్చుకునేందుకు మహిళలు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. నాట్య గురువు తిప్పన ధనుంజయరెడ్డి దంపతులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, ఒడిశా చీకటి చైర్మన్ కాతిల నరసింహమూర్తి, రంగాల జానకీరామ్, దక్కత రామారావు, కుమార స్వామి, కళాకారులు గొనప లక్ష్మణమూర్తి, చలపరాయి వినోద్, రవికుమార్, లక్ష్మీనారాయణ, లోపింటి శంకర్, గంధవు సోమేశ్, గేదెల పరుశురామ్, దుర్గాశి మీన పాల్గొన్నారు.


కోలాటం నాట్య గురువు ధనుంజయరెడ్డి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

డొంకూరులో జ్వరాలు

ఇచ్ఛాపురం రూరల్: వారం రోజుల నుంచి డొంకూరు తీర ప్రాంతంలోని ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో వైద్య సిబ్బంది వైద్య సహాయక చర్యలు చేపట్టకపోవడంతో బాధితులు ఒడిశా, ఇచ్ఛాపురం, కవిటి వంటి ప్రాంతాల్లో ప్రైవేటు వైద్యులు, ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. మూడు రోజుల కిందట పుక్కళ్ల గురమ్మ అనే మహిళా తీవ్ర జ్వరంతో బస్సులో ఇచ్ఛాపురం ఆస్పత్రికి వెళ్తుండగా, మధ్య దారిలోనే అస్వస్థతకు గురై స్పృహ తప్పి పడిపోయింది. దీంతో ఆమెను హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. బుడ్డ నవీన్ అనే ఆరు నెలల పసివాడు తీవ్ర జ్వరంతో బాధపడితే ఆస్పత్రిలో చేర్పించామని, సుమారు పాతిక వేల వరకు ఖర్చయిందని నాన్నమ్మ నీలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చాలా మంది జ్వరాలతో బాధపడుతూ ఇచ్ఛాపురం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈదుపురం నూతన ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటే బాగుంటుందని తెలిపారు.

భక్తులకు అన్నదానం


అన్న ప్రసాదం స్వీకరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ:

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ముత్యాలమ్మకోనేరు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు సోమవారం అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా మున్సిపాలిటీలోని బాలకృష్ణ అభిమాన సంఘం వారు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అభిమాన సంఘ కార్యవర్గ సభ్యులు తాళ్లభద్ర బాబూరావు, గొలుసు వాసుదేవరావు, వసంతరెడ్డి, బోనెల శివ, మద్దిల రాజు, రొక్కం సోమేష్, రట్టి మనోజ్, జీవన్, బంపల్లి అప్పారావు, నందమూరి ఉన్నారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

కవిటి: మండల సర్వ సభ్య సాధారణ సమావేశాన్ని మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.